సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 7 । జూలై । 2023



ఐటీడీఏ నర్సరీల్లో పండ్ల మొక్కలు

ఉద్యాన వన నర్సరీలకు పూర్వవైభవం రానుంది. ఇటీవల ఐటీడీఏ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్ ఇందుకు కృషి చేస్తున్నారు. 8లో▸



అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాహుల్

ఇచ్చోడ: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఎస్సీ జిల్లా మేనేజర్ కామెరి రాహుల్ సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారంకిత్రం ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన క్విజ్ పోటీలో ఇచ్చోడ జెడ్పీఎస్ఎస్ విద్యార్థినులు వైష్ణవి, సుప్రియ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇచ్చోడ సీఎస్సీ నిర్వాహకుడు కొండ ప్రశాంత్ సీఎస్సీ తరఫున రూ.2వేల నగదు అందించారు. ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉదయ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

ఎదులాపురం: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బిల్లులు పెండింగ్‌లో ఉండడం ఫలితంగా మెనూ ప్రకారం భోజనం అందడం లేదని తెలిపారు. జీసీసీలో సరుకులు పంపిణీ చేసేందుకు ఎవరూ టెండర్ తీసుకోవడానికి ముందుకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంజేశారు. బంగారు తెలంగాణలో విద్యార్థుల మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించలేని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని సచిన్ డిమాండ్ చేశారు.

'దొరల పాలన అంతం చేయడమే ధ్యేయం'



మాట్లాడుతున్న సాకటి దశరథ్

నేరడిగొండ: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి దొరల పాలనను అంతం చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు హీరాసింగ్, పట్టణాధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్ సమక్షంలో పార్టీలో చేరిన పలువురికి దశరథ్ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబ పాలనను గద్దె దించడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని చెప్పారు. ఈసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆమ్టే మాధవ్‌రావ్, సుభాష్ సూర్య, తొడసం శంకర్, సాబ్లే సంతోష్, బాక్రే లక్ష్మణ్, రాథోడ్ రాజశేఖర్, బాక్రే శేఖర్, జాదవ్ పవన్, సాయిప్రసాద్, వికాస్, అరుణ్, కరణ్, శ్రీనివాస్, ఉదయ్ వంశీ, గంగు పాల్గొన్నారు.

కొనసాగిన స్వీపర్ల ఆందోళన



స్వీపర్లకు సంఘీభావం తెలుపుతున్న సుజాత

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన నాలుగోరోజుకు చేరింది. గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మతీన్, రసూల్, రాములు తదితరులున్నారు.

పాకో మిషన్ ద్వారా కంటి ఆపరేషన్లు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో పాకో మిషన్ ద్వారా బుధవారం కంటి శస్త్రచికిత్సలు చేశారు. ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వర్చువల్ విధానంలో ఈ పరికరాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కంటి వైద్యులు నూతన పరికరం ద్వారా ముగ్గురికి ఆపరేషన్లు చేశారు. ఎలాంటి కుట్లు వేయాల్సిన అవసరం లేకుండా ఈ నూతన అధునాతన సేవలు ప్రారంభించడంతో జిల్లా వాసులకు మేలు జరగనుందని వైద్యులు పేర్కొన్నారు. ఆపరేషన్ చేసిన వారిలో వైద్యులు ఇద్రిస్ అక్రాని, లింగేశ్, రాజ్యలక్ష్మి, వాత్సల్యత తదితరులున్నారు.



రిమ్స్ ఆస్పత్రి

పీజీ సీట్లు పెరిగినయ్..

- రిమ్స్‌కు కొత్తగా 29 మంజూరు
- గతంలో 43 సీట్లు మాత్రమే..
- 72కు చేరిన మొత్తం సీట్ల సంఖ్య
- త్వరలోనే కౌన్సెలింగ్ ప్రక్రియ

బోధకుల పోస్టుల వివరాలు

హోదా	మంజూరైన పోస్టులు	భర్తీ	ఖాళీ
ప్రొఫెసర్	21	17	04
అసోసియేట్ ప్రొఫెసర్	30	12	18
అసిస్టెంట్ ప్రొఫెసర్	41	30	11
ట్యూటర్	56	20	36
మొత్తం	148	79	69

సాక్షి, ఆదిలాబాద్: రిమ్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ మెడికల్ కోర్సుల సీట్లు భారీగా పెరిగాయి. ఇదివరకు 43 సీట్లు ఉండగా, తాజాగా మరో 29 పెంచారు. దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో కొత్తగా ఇటీవల 3,714 సీట్లకు అనుమతులు జారీ అయినట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ గణాంకాలు తెలిపాయి. ఇందులో రిమ్స్‌లో 29 సీట్లు పెరగగా.. మొత్తం 72 సీట్లు ఉన్నాయి.

సబ్జెక్టుల వారీగా సీట్లు ఇలా..

రిమ్స్‌లో పీజీకి సంబంధించి సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే.. జనరల్ మెడిసిన్‌లో-7, అనస్తీయాలోజీలో-7, రెస్పిరేటరీ మెడిసిన్‌లో-5, డెర్మటాలజీలో-5, జనరల్ సర్జరీలో-6, ఆర్థోపెడిక్స్‌లో-5, ఆప్తమాలజీలో-3, ఓటీఓలో-3, గైనకాలజీలో-2, అనాటమిలో-5, ఫిజియాలజీలో-5, బయోకెమిస్ట్రీలో-3, ప్యాథాలజీలో-4, ఫార్మాలజీలో-5, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో-2, కమ్యూనిటీ మెడిసిన్‌లో-5 సీట్లు ఉన్నాయి. 2020–21లో రిమ్స్‌కు పీజీ మంజూరు కాగా, ప్రతీ సంవత్సరం సీట్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది.

మొదటి నుంచి ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రధాన ఆస్పత్రిగా కొనసాగిన జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని 2008లో రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)గా ఉన్నతీకరించారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వెనుకబడిన మారుమూల జిల్లాలో గిరిజనులకు నాణ్యమైన వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో ఈ వైద్యకళాశాలను ప్రారంభించారు. ఎంబీబీఎస్ వంద సీట్లతో మొదలైంది. ప్రస్తుతం 120 సీట్లకు పెంచారు. పీజీ సీట్లు కూడా భారీగా పెరగడంతో ఇక్కడి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌తో పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం అభ్యసించే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది.

ఇటీవలే 35 పోస్టులు భర్తీ



రిమ్స్‌లో ఇటీవలే ప్రభుత్వం 35 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేసింది. యూజీ, పీజీ చదువుకునే విద్యార్థులకు సంబంధించి సరైన బోధన అందేలా చర్యలు తీసుకుంటున్నాం. తాజాగా పీజీ సీట్లు మెడికల్ కౌన్సెలింగ్ నుంచి పెంచారు. మరింత నాణ్యమైన బోధన అందించేలా చర్యలు తీసుకుంటాం. – జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

గంజాయి సాగు చేస్తే రైతుబంధు నిలిపివేత



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: గంజాయి సాగు చేసిన రైతులకు రైతుబంధు సాయం నిలిపివేసి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో పోలీస్, ఎక్సైజ్, అటవీ, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు అక్రమరవాణా చేసిన వారితోపాటు వినియోగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారిని గుర్తించి మానసిక వైద్యులతో చికిత్స అందించాలని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని, పాఠశాలలు, కళాశాలలు, రైతువేదికలు, ఇతర ప్రజా సమూహ ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించి చైతన్యపరచాలని సూచించారు. ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ ద్వారా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిరంతరణ పర్యవేక్షణ చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. సమావేశంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, అబ్కారీశాఖ అధికారి హిమశ్రీ, డీఈవో టీ ప్రణీత, డీఏవో పుల్లయ్య, డీఎస్సీడీవో సునీతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బియ్యం సరఫరా చేయాలి

ఆదిలాబాద్ రూరల్: మిల్లింగ్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి సకాలంలో బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ శివారు ప్రాంతంలోని వినాయక ట్రేడర్స్, సాయి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల్లో వడ్ల నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లింగ్ విధానాన్ని పూర్తిచేసి బియ్యం అందించే చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్, జిల్లా మేనేజర్ సుధారాణి తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలయ్యాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ ఆరోపించారు. గురువారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల గురించి చర్చించి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని విమర్శించారు. ఈనెల 8న వరంగల్ పర్యటనకు వచ్చే అర్హత మోదీకి లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు, లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేజీ టూ పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి లెనిన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమేర్ పాషా, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన పంచాయతీ కార్మికులు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని విధులు బహిష్కరించిన జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో 60 ప్రకారం కనీస వేతనం రూ.15,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 11వ పీఆర్సీ అమలు చేయాలని పోరాడుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా జీవో 48ని తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచాలంటూ అదనపు పనిభారాన్ని మోపిందని పేర్కొన్నారు. జీవో 51 ద్వారా మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చి మరింత పనిభారాన్ని పెంచిందని మండిపడ్డారు. అర్హులకు సహాయ పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించేదాకా సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీఐటీయూ నాయకులు ఆశన్న, కిరణ్, చిన్నన్న, యూనియన్ నాయకులు శ్రీనివాస్, అడెల్లు, గంగన్న, దశరథ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వర్షపాతం లెక్క.. మరింత పక్కా

- కొత్తగా ఐదు రెయిన్‌గేజ్ స్టేషన్లు
- వేధిస్తున్న ఎంపీఎస్వోల కొరత



ఆదిలాబాద్ రూరల్ తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో వర్షపాతం లెక్క ఇక మరింత పక్కాగా తేలనుంది. ఇప్పటివరకు పాత మండలాల్లోని మాన్యువల్ రెయిన్‌గేజ్ స్టేషన్ల ఆధారంగానే వర్షపాతాన్ని లెక్కిస్తూ వస్తున్నారు. 13 మండలాల్లో నమోదైన వర్షపాతాన్ని జిల్లా వర్షపాతంగా లెక్కిస్తూ వచ్చారు. తాజాగా ఇండియన్ మెటలార్జికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ) ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పడ్డ మండలాల్లోనూ రెయిన్‌గేజ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వర్షం లెక్క ఇకపై పక్కాగా తేలనుంది.

ఐదు మండలాల్లో ఏర్పాటు

ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలుండగా ఇప్పటి వరకు 13 మండలాల్లోనే మాన్యువల్ రెయిన్‌గేజ్ స్టేషన్లున్నాయి. తాజాగా గాదిగూడ, భీంపూర్, సిరికొండ, మావల, ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో ఒక్కోదాన్ని రూ.33వేల వ్యయంతో ఐదింటిని ఏర్పాటు చేశారు. వర్షపాతాన్ని ప్రణాళిక విభాగానికి సంబంధించి మండల ప్లానింగ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్వో)లు లెక్కిస్తారు. వీరు 18 మండలాలకు ప్రస్తుతం ఆరుగురే పనిచేస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్, తాంసి, భీంపూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లిలో మాత్రమే ఎంపీఎస్వోలున్నారు. సరిపడా ఎంపీఎస్వోలు లేక ఒక్కొక్కరికి మూడేసి మండలాల బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలు కలిగిన మండలాల్లో వర్షపాతాన్ని కొలవడం ఇబ్బందికరంగా మారనుంది. దీంతో ఈ విధులను వీఆర్ఏలు నిర్వహించాల్సి వస్తోంది. ఏ విధంగా స్టేషన్‌ను నిర్వహించాలి.. వర్షపాతాన్ని ఎలా లెక్కించాలనే దానిపై ఇదివరకు వీఆర్ఏలకు శిక్షణ ఇచ్చినట్లు సీపీవో వెంకటరమణ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షపాతాన్ని లెక్కిస్తున్నట్లుగా తెలిపారు. వీఆర్ఏల ద్వారా తహసీల్దార్‌కు వారి నుంచి సీపీవోకు అక్కడి నుంచి కలెక్టర్‌కు వర్షపాతం వివరాలు అందనున్నాయి.

సగం కూడా కురవలే

జూన్‌లో జిల్లా సాధారణ వర్షపాతం 202.09 మిల్లీ మీటర్లు కాగా 86.6 మిల్లీ మీటర్ల వర్షమే కురిసింది. దీంతో కురవాల్సిన దాంట్లో సగం కూడా కురవలేదు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ లోటు వర్షపాతమే నమోదైంది. దీంతో అన్నదాతలు విత్తనాలు నాటుకుని ఆకాశం వైపు చూడాల్సిన దుస్థితి నెలకొంది. అత్యధికంగా జైనథ్ మండలంలో 80శాతం లోటు వర్షపాతం ఉండగా అత్యల్పంగా నార్నూర్‌లో 36శాతం లోటుగా నమోదైంది. జూలైలో గడిచిన ఆరు రోజుల్లో 51.1 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 33.6 మిల్లీ మీటర్లకే పరిమితమైంది. అత్యధికంగా గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాల్లో 74శాతం లోటు వర్షపాతం రికార్డయింది. అత్యల్పంగా తాంసి మండలంలో 3శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు ప్రణాళికా విభాగం అధికారులు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట నాయీబ్రాహ్మణుల ఆందోళన



ధర్నా చేస్తున్న నాయీబ్రాహ్మణులు

కైలాస్‌నగర్: తమ కులవృత్తిని తామే చేసుకుని జీవించేలా రజకుల మాదిరిగా ప్రత్యేక చట్టం తీసుకురావాలని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంతకుముందు కార్పొరేట్ సెలూన్ షాపుల ఏర్పాటుకు వ్యతిరేకంగా పట్టణంలో దుకాణాలు మూసివేసి ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. కులవృత్తిలోకి ఇతర మతస్తులు రావడంతో తమకు ఉపాధి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఇతర మతస్తులు కార్పొరేట్ సెలూన్ షాపులు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. వాటిని వెంటనే మూసివేయించాలని డిమాండ్ చేశారు. సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాములు, వేణుగోపాల్, నాయకులు రామ్‌కుమార్, రాజు, శ్రీకాంత్, వెంకన్న, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం రిమ్స్ ఆస్పత్రిలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ సమక్షంలో ఎన్నికలు నిర్వహించగా, జిల్లా అధ్యక్షురాలిగా శంకరమ్మ, కార్యదర్శిగా మెరుగు శివయ్య ఎన్నికయ్యారు. అంతకుముందు వారు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్, సంఘం బాధ్యులు భాస్కర్, అరుణ్, ఆనంద్, దేవేందర్, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్‌పై దృష్టి సారించాలి



కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ సోయం బాపూరావు కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రధాన రైల్వే సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా హైదరాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేసి, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. 2017లో మంజూరైన ఆదిలాబాద్–పటాన్‌చెరు రైలుమార్గం పూర్తిచేస్తే వెనుకబడిన జిల్లాలోని ఆదివాసీలకు రాష్ట్ర రాజధాని వరకు ప్రయాణ భారం తగ్గుతుందని పేర్కొన్నారు. రైల్వేలైన్ సర్వే పనుల కోసం ఆరేళ్ల కిందట రూ.4,109 కోట్ల బడ్జెట్ మంజూరైందని తెలిపారు. పటాన్‌చెరు నుంచి బోధన్ వరకే సర్వే పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సర్వే పనులు వేగవంతం చేయాలని విన్నవించారు. 317 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు పూర్తయితే ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఇందుకు కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి ఆదిలాబాద్ రైల్వే సమస్యల గురించి దృష్టి సారిస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. ఎంపీ వెంట బీజేవైఎం నాయకుడు రాళ్లబండి మహేందర్ ఉన్నారు.

డీఆర్డీవో కిషన్‌పై సస్పెన్షన్ వేటు



ఎస్.కిషన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ డీఆర్డీవో ఎస్.కిషన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై బుధవారం ప్రిన్సిపల్ సెక్రటరీ రాష్ట్రంలోని డీఆర్డీవోలు, ఏపీడీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ డీఆర్డీవో అందుబాటులోకి రావాలని పిలువగా రాలేదు. టెలీకాన్ఫరెన్స్ సమయంలో అందుబాటులో ఉండకుండా ఎక్కడికి వెళ్లారని కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏపీడీలను ప్రశ్నించగా.. కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లారని వారు సమాధానమిచ్చారు. దీంతో ప్రిన్సిపల్ సెక్రటరీ వెంటనే కలెక్టర్‌ను ఫోన్‌లో ఈ విషయమై ఆరా తీయగా డీఆర్డీవో తన వద్దకు రాలేదని చెప్పినట్లు తెలుస్తోంది. టెలీకాన్ఫరెన్స్‌ను నిర్లక్ష్యం చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రిన్సిపల్ సెక్రటరీ డీఆర్డీవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త డీఆర్డీవోను నియమించుకునే అధికారం కలెక్టర్‌కు అప్పగిస్తున్నట్లు అందులో పేర్కొన్నట్లు అధికారవర్గాలు తెలిపిన సమాచారం. అయితే కొత్త డీఆర్డీవోగా ప్రస్తుతం ఏపీడీగా ఉన్న రాథోడ్ రవీందర్, గతంలో డీఆర్డీవోగా పనిచేసిన అనుభవం కలిగి, ప్రస్తుతం జెడ్పీ డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాథోడ్ రాజేశ్వర్‌ను నియమించవచ్చనే చర్చ జోరుగా సాగుతోంది. కలెక్టర్ నిర్ణయం మేరకు కొత్త డీఆర్డీవో శుక్రవారం బాధ్యతలు స్వీకరించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుకున్న పటికతో ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్‌లో గురువారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2 క్వింటాళ్ల పటికను పట్టుకున్నారు. 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవి తెలిపారు. గ్రామంలోని ఓ పాడుబడిన ఇంట్లో రహస్యంగా దాచి ఉంచిన వాటిని స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేశామన్నారు. బంక భూమన్నపై కేసు నమోదు చేయడంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో ఉపతహసీల్దార్ మంజుల ఎదుట బైండోవర్ చేశామన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

ఖానాపూర్: బాలికను వేధించిన మధ్యప్రదేశ్‌కు చెందిన చాంద్‌కుమార్ మారావిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బుధవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పాత తర్లపాడ్ గ్రామశివారులో గల సిమెంట్ ఇటుక బట్టీలో మహారాష్ట్రకు చెందిన ఓ కుటుంబం పనిచేస్తుందని తెలిపారు. వారి కూతుర్ని అక్కడే పనిచేస్తున్న వ్యక్తి లైంగికంగా వేధిస్తున్నాడన్నారు. నిర్మల్ డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



గాయాలు చూపిస్తున్న చిన్నారి

ముధోల్: మండల కేంద్రంలో గురువారం కుక్కలు చిన్నారులపై దాడిచేసి గాయపరిచాయి. నయాబాదికి చెందిన జుబేదా, పర్వీన్, ఇర్ఫాన్ ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వారిపై దాడి చేసింది. గమనించిన వృద్ధురాలు హైమద్‌బీ వాటిని తరిమేందుకు ప్రయత్నించగా ఆమెపై కూడా దాడి చేశాయి. పట్టణంలోని పలు వీధుల్లో కుక్కలు గుంపుగుంపులుగా తిరుగుతూ చిన్నారులు, వృద్ధులపై దాడులకు పాల్పడుతుండడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కల బెడదను నివారించేందుకు అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

కుభీర్(ముధోల్): మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఖదం రమాకాంత్‌కు చెందిన మేక మృతి చెందింది. మేక విలువ 16 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రమాకాంత్ కోరుతున్నాడు.

ఐటీడీఏ నర్సరీల్లో పండ్ల మొక్కలు!



ఉట్నూర్ నర్సరీలో పెంచుతున్న మునగ మొక్కలు

- పూర్వ వైభవం సంతరించుకుంటున్న ఉద్యాన నర్సరీలు
- ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటు
- అందుబాటులో కొబ్బరి, మునగ, మామిడి మొక్కలు
- రైతుల ఆర్థికాభివృద్ధికి అధికారుల ప్రత్యేక చర్యలు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉద్యాన వన నర్సరీలకు పూర్వవైభవం సంతరించేలా ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నెల రోజుల క్రితం ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్ రైతుల మేలుకోసం కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు నర్సరీల్లో కొబ్బరి, మామిడి, మునగ మొక్కలను పెంచి రైతులకు సబ్సిడీపై అందిస్తున్నారు. పీవీటీజీ రైతులకు ఉద్యాన నర్సరీలో వ్యవసాయం, కూరగాయల సాగు, పండ్ల తోటల్లో అంతర పంటగా కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు.

రైతులకు అందుబాటులో మొక్కలు

ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, భీమారం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగాలో నర్సరీలు కొనసాగుతున్నాయి. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడమే లక్ష్యంగా ఆయా నర్సరీల్లో కొబ్బరి, మామిడి, మునగ మొక్కలు అందుబాటులో ఉంచారు. ఉట్నూర్ నర్సరీలో 10 వేల కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉంచగా ఇప్పటికే 5,500 మొక్కల విక్రయాలు జరగాయి. ఈ నాణ్యమైన మొక్కల ద్వారా కొబ్బరి బొండాలతో పాటు ఎండు కొబ్బరితో రైతులకు రెండు రకాల ఆదాయం చేకూరుతుంది. ఈ ఏడాది బెల్లంపల్లి, భీమారం, జంబుగాలో 25 వేల మామిడి మొక్కలు, 25 వేల మునగ మొక్కలు రైతులకు అందుబాటులోకి తేనున్నారు. మునగ మొక్కలు మరో 10 రోజుల్లో, మామిడి మొక్కలు 6 నెలల్లో విక్రయానికి సిద్ధం కానున్నాయి. సిద్ధంగా ఉన్న కొబ్బరి మొక్కలు ఇప్పటికే విక్రయాలు జరిగాయి. మునగ మొక్కలు నాణ్యమైనవి కావడంతో తక్కువ సమయంలో కాయలు చేతికి వస్తాయి. రైతులు విక్రయించేందుకు ఎంతో దోహదపడనుంది. బయట మార్కెట్ కంటే ఐటీడీఏ నర్సరీల్లో తక్కువ ధరకే కొబ్బరి మొక్క రూ.50, మామిడి మొక్క రూ.45, మునగ మొక్క రూ.20 చొప్పున అందించనున్నారు. అంతే కాకుండా నీటి వసతి కలిగిన రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.



ఉట్నూర్ నర్సరీలో కొబ్బరి మొక్కలు



ఉట్నూర్ నర్సరీలో పెంచుతున్న మామిడి మొక్కలు

ఆసక్తి కనబరుస్తున్నారు



ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు పంటల సాగుతో ఆర్థికంగా ఎదిగేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. హార్టికల్చర్‌లలో నాణ్యమైన విత్తనాలు, కూరగాయలు, పండ్ల తోటల ఏర్పాటు, పండ్ల మొక్కలు అందుబాటులో ఉంచుతున్నాం. మొక్కలు నాటే విధానం, మెలకువలు, తక్కువ సమయంలో లాభదాయకంగా పండించే పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సందీప్‌కుమార్, ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి

ఆపరేషన్‌కు అండగా నిలిచిన 'సాక్షి'

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి..
- 18 నెలలుగా మంచం పట్టిన మల్లేశ్
- 'సాక్షి' కథనంతో స్పందించిన దాతలు
- నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్

సాక్షి స్పందన

కడెం(ఖానాపూర్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. అచేతనస్థితిలో 18 నెలల పాటు మంచం పట్టిన కడెం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశ్ దీనగాథను మే 20న, 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. ఈనెల 5న నిర్మల్ జిల్లా కేంద్రంలోని దేవేందర్‌రెడ్డి ఆస్పత్రిలో బాధితుడికి ఆపరేషన్ పూర్తి చేశారు.

దాతలు స్పందించారు..

కొత్త మద్దిపడగకు చెందిన రామవ్వ–లక్ష్మణ్ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు మల్లేశ్‌కు లక్ష్మీసాగర్‌కు చెందిన యువతితో వివాహమైంది. దంపతులకు రెండేళ్ల కుమారుడు సంతానం. 2021 డిసెంబర్‌లో ధర్మాజీపేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతింది. ఉస్మానియా, నిమ్స్, రిమ్స్ తదితర ఆస్పత్రులు తిరిగి సుమారు రూ.లక్ష వరకు ఖర్చు చేసినా నయం కాలేదు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో అతని భార్య వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో కొడుకు, మనవడి ఆలనా పాలన తల్లి రామవ్వ చూసుకుంటోంది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో 18 నెలలుగా మంచం పట్టిన మల్లేశ్‌కు తినడానికి తిండి కూడ లేని పరిస్థితి. ఈ క్రమంలో 'సాక్షి'లో వచ్చిన కథనం అందిరినీ కలచివేసింది. సాక్షి కథనం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడడంతో మల్లేశ్‌కు సాయం చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి దాతలు ముందుకు వచ్చారు.

అభాగ్యుడిని ఆదుకున్నారు..

మల్లేశ్ పరిస్థితి చూసిన గ్రామ యువత చలించిపోయారు. ఆపదలో ఉన్న మిత్రుడిని బతికించుకోవాలని వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మార్కరి సతీశ్, దుల్లె దినేశ్, మార్కరి నవీన్, జాగీరు రాజేశ్‌గౌడ్, జాడి గంగాధర్, మోతె శేఖర్, ఎ.గంగాధర్, తదితర యువకులు గ్రామంతో పాటు విదేశాల నుంచి వివిధ రూ.లక్షా ఇరవైవేల వరకు పోగు చేశారు. 'జై జవాన్..జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు, పూర్ణ యువసేన సభ్యులు, తదితరులు సాయం అందించారు.



నిర్మల్‌లోని ఆస్పత్రిలో ఆపరేషన్ పూర్తి చేసుకున్న మల్లేశ్

అండగా నిలిచిన మంత్రి పీఏ

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పీఏ కృష్ణంరాజు అండగా నిలిచారు. గత నెల 6న రూ.5 వేల నగదు, మూడునెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. ఆపరేషన్‌కు లక్షా యాభైవేలు అవసరం కాగా దాతల ద్వారా రూ.లక్ష వరకు పోగయ్యాయి. మిగతా రూ.50 వేలు, మందుల ఖర్చులను భరించేందుకు ముందుకు రావడంతో ఆపరేషన్ పూర్తయ్యింది.

'సాక్షి'కి రుణపడి ఉంటా

నాకు ఆపరేషన్ అవుతుందని కలలో కూడా ఊహించలేదు. ఏడాదిగా నన్ను ఎవరూ పట్టించుకోలేదు. అలాంటిది సాక్షి పేపర్‌లో వచ్చిన వార్తతో నాకు తెలియని ఎంతోమంది వారికి తోచిన సాయం అందించారు. ఇందుకు 'సాక్షి'కి రుణపడి ఉంటా. నా ఆపరేషన్‌కు సహకరించిన దాతలందరికీ కృతజ్ఞతలు.

– నాంపెల్లి మల్లేశ్

సామాజిక పరివర్తనకు కవి సమ్మేళనాలు

- మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్: సామాజిక పరివర్తనకు కవి సమ్మేళనాలు దోహదం చేస్తాయని అఖిల భారత మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలోని బుద్ధ విహార్‌లో గురువారం ఏర్పాటు చేసిన బహుజన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు కవులు సామాజిక న్యాయాన్ని గురించి వినిపించిన కవితలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్రలోని కవులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పూలే, సాహూ, అంబేద్కర్ల వాదాన్ని బహుజనులంతా అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కవి సమ్మేళనంలో భాగంగా పూలే దంపతుల జీవిత చరిత్రపై వందన శంబాజీ ప్రదర్శించిన ఏకపాత్రాభినయం ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో ప్రముఖ కవులు మధుబావల్కర్, రిటైర్డ్ ఎస్బీఐ మేనేజర్ సోమాజి, అశోక్, యూనిస్ అఖ్బాని, అనిల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిని చంపిన తనయుడికి జీవిత ఖైదు

ఆదిలాబాద్‌టౌన్: తల్లిని చంపిన తనయుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. జైనథ్ గ్రామానికి చెందిన రూపాని లసుంబాయికి నలుగురు సంతానం. వీరందరు వేర్వేరుగా జీవిస్తున్నారు. బాధితురాలు ఐదెకరాల పంట చేను కౌలుకు ఇచ్చి అదే గ్రామంలో ఒంటరిగా జీవిస్తోంది. పెద్ద కుమారుడు రూపాని నాందేవ్ కౌలు డబ్బులు ఇవ్వాలని తల్లితో తరచూ గొడవ పడేవాడు. 2020 మే 12న తాగిన మైకంలో తల్లితో గొడవపడగా ఆమె డబ్బులు ఇవ్వనని చెప్పింది. దీంతో భార్య దీపికను పిలిచి పెట్రోల్ తెమ్మని తల్లిపై పోసి నిప్పంటించాడు. అరుపులు విన్న స్థానికులు వచ్చి మంటలు ఆర్పివేశారు. రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందించినా 2020 ఆగస్టు 3న ఇంట్లో మృతి చెందింది. మృతురాలి కూతురు శాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడితో పాటు అతని భార్యపై కేసు నమోదు చేసి అప్పటి జైనథ్ సీఐ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. లసుంబాయి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో వాంగ్మూలనం తీసుకున్నారు. నేరస్తుడి భార్యపై నేరం రుజువు కానందున ఆమెను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పీపీ 21 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఈ మేరకు జడ్జి శిక్ష విధించినట్లు వివరించారు.

లారీ కిందకు దూసుకెళ్లిన బైక్

- ఒకరికి తీవ్రగాయాలు

 భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని శివాజీచౌక్‌లో ఎదురుగా వస్తున్న లారీ కిందకు బైక్ దూసుకెళ్లిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు, కాగా మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. దిలావర్‌పూర్ మండలం కుస్లి గ్రామానికి చెందిన దత్తహరి, మోహన్ వ్యవసాయ పరికరం వెల్డింగ్ కోసం గురువారం ఉదయం భైంసాకు వచ్చారు. శివాజీచౌక్ మీదుగా పట్టణంలోకి వస్తుండగా కూడలి వద్ద ఎదురుగా వస్తున్న లారీ కిందకు దూసుకెళ్లారు. ఘటనలో బైక్ నడుపుతున్న దత్తహరికి చేతికి తీవ్రగాయాలు కాగా, మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.



లారీ కిందకు దూసుకెళ్లిన బైక్

చించోలి(బి) గుట్ట వద్ద మృతదేహం లభ్యం

సారంగపూర్(నిర్మల్): జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్(26) మృతదేహం గురువారం చించోలి(బి) రిజర్వు ఫారెస్ట్ గుట్టవద్ద లభ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పశువులు మేపేందుకు వెళ్లిన కాపరులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌వాసిదిగా గుర్తించారు. నిర్మల్ పట్టణ పోలీసులతో పాటు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు ఈ నెల 2న ఇంట్లో భార్యతో గొడవపడి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి వెతుకుతున్నా ఆచూకీ లభించలేదన్నారు. కాగా అప్పటికే మృతదేహం కుళ్లిపోయింది. వైద్యాధికారి వేణుగోపాల కృష్ణ శవపంచనామా నిర్వహించారు. మృతునికి భార్య శభాన ఉన్నారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అందవెల్లి పెద్దవాగు వద్ద గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. బుధవారం దహెగాం మండలం దేవాజీగూడ గ్రామానికి చెందిన ఇడిదినేని మల్లయ్య (65) అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన వద్ద వాగు దాటుతుండగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయారు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా బోడపల్లి శివారులో మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య దుర్గక్క, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు.

ముందు బిల్లులివ్వండి.. తర్వాతే విద్యార్థులొస్తారు

- ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవోతో హెచ్ఎం
- పాఠశాలను తనిఖీ చేసిన చాహత్ బాజ్‌పాయ్



తనిఖీ నిర్వహిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఆశ్రమ పాఠశాల తనిఖీకి వచ్చిన ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు అనుకోని సంఘటన ఎదురైంది. గురువారం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ ఆశ్రమోన్నత పాఠశాలలో పీవో తనిఖీకి వచ్చిన సమయంలో ఒక్క విద్యార్థి కూడా లేక పోవడంతో ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా విద్యార్థులు రాకపోవడంపై నిలదీశారు. విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. మరో నాలుగు రోజుల్లో తిరిగి తనిఖీ నిర్వహిస్తామని పరిస్థితి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ముందుగా విద్యార్థుల భోజన బిల్లులు ఇవ్వాండి.. ఆ తర్వాతే విద్యార్థులు వస్తారని అన్నాడు. గతేడాది 8 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఈసారి గుత్తేదారు ఇంకా భోజన సరుకులు సరఫరా చేయలేదన్నాడు. స్పందించిన పీవో ప్రస్తుతం భోజనానికి సంబంధించి బిల్లులను సంబంధిత ప్రధానోపాధ్యాయులే భరించాలన్నారు. నివేదిక పంపిస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు.

విద్యార్థులకు సర్దిచెప్పి బోధన అందించాలి

బెజ్జూర్: విద్యార్థులకు సర్దిచెప్పి బోధన అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బెజ్జూర్ మండలంలోని కుంటలమానేపల్లి, సలుగుపల్లి, బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఇంటికి పంపవద్దని, త్వరలో ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర వస్తువులు అందజేస్తామన్నారు. ఆమె వెంట ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరామ్ ఉన్నారు. అనంతరం కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా హెచ్ఎన్‌టీసీ నర్సరీని పరిశీలించారు.

మద్యం దుకాణంలో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీవల్లి వైన్స్ దుకాణంలో చోరీ జరిగింది. దుకాణం నిర్వాహకుడు రెబ్బెన సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి రోజువారీగా మద్యం అమ్మకాలు ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. ఉదయం వచ్చి షెట్టర్ తెరిచి చూడగా దుకాణం పైకప్పు రెకులు తొలగించి ఉండడం గమనించారు. దుకాణంలో పరిశీలించగా సుమారు రూ.25 వేల నగదు, రూ.23 వేల విలువైన మద్యం బాటిళ్ల చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. జైనూర్ మండలంలోని పొలాసకు చెందిన లాల్ ఖాన్ ఆసిఫాబాద్ నుంచి వాంకిడి వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. ఎస్సై సాగర్ క్షతగాత్రుడిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సర్వీస్ వైరే యమపాశమైంది...

- విద్యుత్ షాక్‌తో యువకుడు, రెండు గేదెలు మృతి
- సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతో ఘటన



రమాకాంత్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద దిక్కును విద్యుత్ సర్వీసు వైరు రూపంలో మృత్యువు పొట్టనపెట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రెబ్బెన మండలం కైరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడకు చెందిన జిట్టవేణి రమాకాంత్ (30)గురువారం పశువుల కాపరి రాకపోవడంతో తానే గేదెలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం గేదెలను తోలుకుని వచ్చి ఇంటిముందున్న షెడ్డు లోపలికి తోలాడు. లోపలికి వెళ్లిన గేదెలు పెద్దగా అరవడంతో లోనికి వెళ్లి అరుస్తున్న గేదెలపై చేయి వేశాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు రెబ్బెన పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.



మృతి చెందిన గేదెలు

సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం

ఇంటికి సరఫరా చేసే విద్యుత్ సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం సంభవించి రెండు గేదెలు, వ్యక్తి మృతి చెందాడని విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ తెలిపారు. స్తంభం నుంచి మీటర్‌కు సరఫరా చేసే సర్వీస్ వైరు రమాకాంత్ ఇంటి ముందు ఉన్న రేకులషెడ్డుపై నుంచి వెళ్తుంది. సర్వీస్ వైరు ఇన్సులేషన్ ఫెయిల్ అయి తీగ తెగి రేకుల షెడ్డుకు తాకడంతో షెడ్డంతా విద్యుత్ సరఫరా అయినట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది గుర్తించారు.

గర్భిణులకు స్కానింగ్ కష్టాలు

జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు స్కానింగ్ కష్టాలు తప్పడం లేదు. రోజుకు 150కు పైగా గర్భిణులు వైద్యపరీక్షల కోసం వస్తుండగా స్కానింగ్ కోసం ఇద్దరు రేడియాలజిస్టులను నియమించారు. ఉదయం 9 గంటలకు ఓపీ సేవలు ప్రారంభంకాగా వారు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసి మధ్యాహ్నం 12 గంటల తర్వాత వస్తుండడంతో గర్భిణులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

– మంచిర్యాలటౌన్

